సాక్షి ప్రకాశం

ఆదివారం । 27 । ఆగస్టు । 2023



మరణ మృదంగం

ఎదురెదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు–బొలెరో ట్రక్కు ఢీకొని ఇద్దరు మృతిచెందారు. త్రిపురాంతకం మండలం ముడివేముల వద్ద ఈ ప్రమాదం జరిగింది. - 8లో..



పేదల కోసమే ఆహా క్యాంటీన్

పేదలకు ఆహా క్యాంటీన్ ఎంతో ఉపయోగపడుతుందని కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్ అన్నారు. కనిగిరిలో శనివారం ఆహా క్యాంటీన్‌ను ఆయన ప్రారంభించారు. - 8లో..

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 36/27

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

ప్రతి కుటుంబానికి మేలు

- రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- మంత్రి ఆదిమూలపు సురేష్



మహిళకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్, అధికారులు, ప్రజాప్రతినిధులు

త్రిపురాంతకం:

ప్రతి కుటుంబానికి మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని రాష్ట్ర మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ కొనియాడారు. రాష్ట్రంలోని అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్నారని తెలిపారు. త్రిపురాంతకం మండలంలోని ఉమ్మడివరం పంచాయతీ పరిధిలో గల గుట్లపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రతి గడపలో ప్రజలకు వివరిస్తూ బుక్‌లెట్లు అందజేశారు. వారికి సంక్షేమ పథకాలు అందిన తీరును స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన అనంతరం ప్రజలకు ఏయే పథకాల ద్వారా ఎంతెంత లబ్ధి చేకూరిందో మంత్రి సురేష్ వివరించారు. పథకాలపై లబ్ధిదారులంతా సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేష్ మాట్లాడుతూ అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాల ఫలాలను రాజకీయాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అందిస్తోందన్నారు. వారి హయాంలో సంక్షేమాన్ని విస్మరించిన ప్రతిపక్షం .. వచ్చే ఎన్నికల్లో వారికి అధికారం అప్పగిస్తే ప్రస్తుతం జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేస్తున్న పథకాలనే కొనసాగిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాల ద్వారా నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకే నగదు జమచేసినట్లు వివరించారు. దేశంలోనే వలంటీర్లు, సచివాలయ వ్యవస్థల ద్వారా ప్రజలకు సేవలందిస్తున్న ఏకైక ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమని మంత్రి స్పష్టం చేశారు. వలంటీర్ల సేవలకు మూడేళ్లుగా పురస్కారాలు, నగదు పారితోషికాలను సీఎం అందిస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.కిరణ్, ఏఓ వరప్రసాద్, ఎంఈఓ టి.రాజశేఖరరెడ్డి, ఏపీఎం ఎడ్వర్డ్, ఏఈలు హనుమాన్‌బాబు, శ్రీనివాస్, మహాంకాళి, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, గ్రామ సర్పంచ్ ఆదిరాములు, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, పార్టీ కన్వీనర్ ఎస్. పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు దగ్గుల గోపాల్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు బూసి నాసరయ్య, వెంకటేశ్వర్లు, నక్కా చిన్న త్రిపురారెడ్డి, రాయల సుబ్బారావు, కోట సుబ్బారెడ్డి, సుబ్రహ్మణ్యం, బాలకోటిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో అప్రంటీస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: ఆర్టీసీలో అప్రంటీస్‌కు ఐటీఐ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్టీసీ నెల్లూరు జోనల్ ట్రెనింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డీజిల్ మెకానిక్, మోటారు మెకానిక్, ఎలక్ట్రీషియన్, వెల్డర్, పెయింటర్, మిషనిస్టు, ఫిట్టర్, డ్రాఫ్ట్స్‌మన్ సివిల్ అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.అప్రంటీస్‌షిప్‌ఇండియా.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో సెప్టెంబర్ 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. చిత్తూరు, తిరుపతి, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో ఏ జిల్లాలో పనిచేసేందుకు ఆసక్తి ఉంటే ఆ జిల్లాను ఎంచుకోవాలన్నారు. చిత్తూరు జిల్లాలో మొత్తం 46, తిరుపతి 102, నెల్లూరు 96, ప్రకాశం జిల్లాలో 56 ఖాళీలు ఉన్నాయని వెల్లడించారు. అభ్యర్థులు దరఖాస్తుల పరిశీలన సమయంలో జోనల్ ట్రెనింగ్ కాలేజీలో రూ.100 చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆ సమయంలో ఒక జత నకలు కాపీలు కూడా తీసుకురావాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు వారి రెజ్యూమ్, సర్టిఫికెట్ల నకళ్లను సెప్టెంబర్ 11వ తేదీలోగా 'ప్రిన్సిపాల్, ఆర్టీసీ జోనల్ ట్రెనింగ్ కాలేజీ, కాకుటూరు, వెంకటాచలం మండలం, నెల్లూరు జిల్లా' చిరునామాకు పంపాలన్నారు. ఏమైనా సందేహాలుంటే 9949810012, 9154291408 సెల్ నంబర్లను ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు సంప్రదించాలని సూచించారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు సమావేశాలు రేపు

ఒంగోలు: నియోజకవర్గాల స్థాయిలో వ్యాయామ ఉపాధ్యాయులకు సోమవారం స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ చైర్మన్ వీఎస్ సుబ్బారావు తెలిపారు. అన్ని యాజమాన్యాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు ఈ స్పోర్ట్స్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో పాల్గొనాలని ఆదేశించారు.

సీఎం జగన్, బాలినేనికి కృతజ్ఞతలు

- వెంకటేశ్వరస్వామివారికి సేవ చేసుకునే భాగ్యం కల్పించినందుకు ధన్యవాదాలు
- వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు



ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న శిద్దా సుధీర్‌కుమార్

ఒంగోలు: అంతర్జాతీయ స్థాయిలో ప్రసిద్ధి చెందిన తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) పాలకవర్గ సభ్యునిగా తన కుమారుడు శిద్దా సుధీర్‌కుమార్‌ను నియమించి వెంకటేశ్వరస్వామివారికి సేవ చేసుకునే భాగ్యం కల్పించినందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ మంత్రి శిద్దా రాఘవరావు పేర్కొన్నారు.



మాట్లాడుతున్న శిద్దా రాఘవరావు, శిద్దా సుధీర్‌బాబు

ఒంగోలులోని వారి నివాసంలో శిద్దా సుధీర్‌కుమార్‌తో కలిసి శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో రాఘవరావు మాట్లాడారు. టీటీడీ పాలకవర్గ సభ్యునిగా తన కుమారుడిని నియమించడం తమకు ఎంతో సంతోషంగా ఉందన్నారు. దైవచింతనతో ముందుకెళ్లాలనే తన కుమారుని ఉద్దేశాన్ని సీఎం దృష్టికి, బాలినేని దృష్టికి తీసుకెళ్లడంతో వారు మంచి మనసుతో స్పందించి అవకాశం కల్పించడం గొప్ప విషయమన్నారు. పేద ప్రజల కోసం దేశంలో ఏ రాష్ట్రంలో అమలు చేయని సంక్షేమ పథకాలను ఏపీలో కొనసాగిస్తూ దేశానికే ఆదర్శంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారన్నారు. టీటీడీలో భక్తులకు సేవలను విస్తృతం చేసేందుకు అనేక సంస్కరణలు జరుగుతున్నాయని, వాటిని మరింత విస్తృతం చేసి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని శిద్దా సుధీర్ కుమార్‌కు సూచించారు. తమకు ఇంతటి మహాభాగ్యాన్ని కల్పించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 2024లో కూడా ముఖ్యమంత్రి అయ్యేందుకు ఆ వెంకటేశ్వరస్వామిని ప్రార్థిస్తున్నట్లు శిద్దా రాఘవరావు పేర్కొన్నారు. శిద్దా సుధీర్‌కుమార్ మాట్లాడుతూ తనకు పదవిచ్చిన ముఖ్యమంత్రికి, అందుకు కారణమైన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. తన తండ్రి శిద్దా రాఘవరావు ఆకాంక్షను తప్పకుండా నెరవేరుస్తూ భక్తులకు మెరుగైన సేవలందిస్తానని చెప్పారు.

బాలినేనిని సత్కరించిన శిద్దా సుధీర్‌కుమార్...

టీటీడీ పాలకవర్గ సభ్యునిగా నియమితులైన శిద్దా సుధీర్‌కుమార్ శనివారం ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ శిద్దా కుటుంబం అంటేనే దైవభక్తి మెండుగా ఉన్న కుటుంబమని అన్నారు. అటువంటి కుటుంబం నుంచి వెంకటేశ్వరస్వామివారికి సేవ చేసే భాగ్యం కల్పిస్తే భక్తులకు మరింత మెరుగైన సేవలు లభిస్తాయనే ఉద్దేశంతో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ అవకాశం కల్పించారన్నారు. స్వామివారి సేవతో మంచి పేరు తెచ్చుకుని భవిష్యత్తులో స్వామివారి ఆశీర్వాదంతో మరిన్ని మంచి పదవులు పొందాలని బాలినేని ఆకాంక్షించారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, హజ్ కమిటీ డైరెక్టర్ ఎస్ఎం బాషా, వైఎస్సార్ సీపీ నగర నాయకుడు కఠారి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్యం

- రాష్ట్రంలోని ప్రతి గడపకూ అందుబాటులోకి తీసుకొస్తాం
- ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రత్యేక అధికారి యాదాల అశోక్



ఘడియపూడి కాలనీలో క్యాన్సర్ పేషెంట్ మనోహర్‌తో మాట్లాడుతున్న ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రత్యేక అధికారి డాక్టర్ యాదాల అశోక్

మద్దిపాడు: ఇంటి వద్దకే వైద్యం అందించే విధానాన్ని రాష్ట్రంలోని ప్రతి గడపకు అందుబాటులోకి తీసుకొస్తామని ఆరోగ్యశ్రీ రాష్ట్ర ప్రత్యేక అధికారి యాదాల అశోక్ తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆ దిశగా చర్యలు చేపట్టారని చెప్పారు. మద్దిపాడు మండలంలోని మద్దిపాడు, వెల్లంపల్లి, గుండ్లాపల్లి, గార్లపాడు, ఘడియపూడి, నాగన్నపాలెం గ్రామాల్లో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్యం చేయించుకున్న పలువురు రోగులను శనివారం ఆయన కలిశారు. వారి ఆరోగ్యంపై ఆరా తీశారు. ఆరోగ్యశ్రీ పథకంలో ఆపరేషన్లు చేయించుకోవడం ద్వారా మేలు జరిగిందా.. లేదా..? అని అడిగి తెలుసుకున్నారు. కీమోథెరపీ చేయించుకుంటున్న క్యాన్సర్ పేషెంట్లు పలువురిని కలిసి కీమోథెరపీకి వెళ్లినరోజు ఐదు వేల రూపాయలు బ్యాంకు ఖాతాలో జమవుతున్నాయా..లేదా..? ఆస్పత్రిలో ట్రీట్మెంట్ ఏ విధంగా ఉంది..? రవాణా ఖర్చులకు డబ్బులిస్తున్నారా, మందులు ఉచితంగా ఇచ్చారా అనే వివరాలడిగి తెలుసుకున్నారు. మద్దిపాడు ఆశా వర్కర్‌గా పనిచేస్తున్న గౌసియాబేగం తనకు క్యాన్సర్ అని, ఆరోగ్యశ్రీ ద్వారా కీమోథెరపీ చేయించుకుంటున్నానని, డాక్టర్ 15 కీమోలు చేయాలని తెలిపారని, ప్రతి కీమోకు వెళ్లిన సమయంలో ఐదు వేల రూపాయల చొప్పున బ్యాంక్ ఖాతాలో జమ చేశారని తెలిపింది. రవాణా ఖర్చులకు కూడా డబ్బులిచ్చారని చెప్పింది. ఆస్పత్రిలో ఉన్నన్ని రోజులు భోజన సదుపాయం కల్పించారంటూ చెమర్చిన కళ్లతో యాదాల అశోక్‌కు తెలపడంతో.. ఆమెను ఆయన ఓదార్చారు. అనంతరం వైఎస్సార్ ఆరోగ్యశ్రీలో ఆపరేషన్లు చేయించుకున్న పలువురు బాలింతలను అశోక్ కలిశారు. వారికి ఆరోగ్యశ్రీ పథకం వివరాలు తెలుపుతూ డబ్బు ఖాతాలో జమయిందా.. లేదా..? అని ప్రశ్నించారు. డయాలసిస్ చేయించుకుంటున్న వారు డయాలసిస్‌కు వెళ్లే సమయంలో 108 వస్తుందా..? డయాలసిస్ అయిన తర్వాత ఇంటికి తరలిస్తున్నారా.? పెన్షన్ పది వేల రూపాయలు అందుతుందా అని అడిగి తెలుసుకున్నారు. నాగన్నపాలెం ఎస్సీకాలనీలో పర్యటిస్తున్న క్రమంలో 8 సంవత్సరాల పాప పాముల హిమని గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోందని తెలుసుకుని ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్యం చేయిస్తానని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా యాదాల అశోక్ మాట్లాడుతూ పేదలకు నాణ్యమైన కార్పొరేట్ వైద్యం అందించాలన్న లక్ష్యంతోనే ఆరోగ్యశ్రీ పథకాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మెరుగుపరిచారని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకంలో మూడు వేల పైచిలుకు రోగాలకు చోటు కల్పించారని చెప్పారు. తద్వారా ప్రతిఒక్కరూ ఆరోగ్యశ్రీ కార్డుతో కార్పొరేట్ వైద్యం చేయించుకోవచ్చన్నారు. ఆయన వెంట సర్పంచ్‌లు గంగిరెడ్డి, కాకర్ల విజయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు శ్రీరాములు, సూపర్‌వైజర్ నాగేశ్వరరావు, ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, హెచ్ఈఓలు పాల్గొన్నారు.

నేడు కొమరోలులో బాలినేని, మాగుంట పర్యటన

- హెలికాప్టర్ ద్వారా పూలవర్షంతో ఘన స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు

కొమరోలు: ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ఆదివారం కొమరోలులో పర్యటించనున్నట్లు స్థానిక ఎంపీపీ కామూరి అమూల్య తెలిపారు. వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ నాయకుడు, మనోజ్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కామూరి రమణారెడ్డి ఆధ్వర్యంలో కొమరోలులో ఏర్పాటు చేసిన కామూరి వారి రాజన్న నిత్య భోజనశాల నూతన భవనాన్ని వారు ప్రారంభిస్తారని చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి, ఇతర ప్రముఖులు హాజరవుతారన్నారు. వారందరికీ ఘనంగా స్వాగతం పలికేందుకు హెలికాప్టర్ ద్వారా పూలవర్షం కురిపిస్తామని తెలిపారు. బేస్తవారిపేట నుంచి కొమరోలుకు నిర్వహించే భారీ ర్యాలీపై హెలికాప్టర్ ద్వారా పూలవర్షం కురిపించనున్నట్లు వెల్లడించారు. మండలంలోని ఇడమకల్లు క్రాస్‌రోడ్డు వద్ద హెలిప్యాడ్ సిద్ధం చేశామన్నారు. నియోజకవర్గంలోని ప్రజలంతా పాల్గొని తమ ఆతిథ్యాన్ని స్వీకరించాలని కోరారు.



సిద్ధం చేసిన హెలిప్యాడ్

31 నుంచి రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు

అర్ధవీడు(కంభం): అర్ధవీడు మండలంలోని రంగాపురం గ్రామంలో రామలింగేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 31వ తేదీ, సెప్టెంబర్ ఒకటో తేదీన రాష్ట్ర స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈనెల 31న పాల పళ్ల సైజు విభాగంలో పాల్గొనే ఎడ్ల యజమానులు రూ.300 ప్రవేశ రుసుం చెల్లించాలని సూచించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.30 వేలు, రూ.20 వేలు, రూ.10 వేలు అందజేస్తామని పేర్కొన్నారు. సెప్టెంబర్ ఒకటో తేదీన ఆరు పళ్ల సైజు విభాగం పోటీల్లో పాల్గొనే ఎడ్ల యజమానులు రూ.500 ప్రవేశ రుసుం చెల్లించాలని సూచించారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 8406513511, 9849339155ను సంప్రదించాలని కోరారు.

పాము కాటుకు మహిళ మృతి

పొదిలి రూరల్: పాము కాటుకు ఓ మహిళ మృతి చెందిన సంఘటన శనివారం పొదిలి మండలంలోని అక్కచెరువు గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గొంటు వెంకటరత్తమ్మ(41) పశువుల మేత కోస్తుండగా కాలిపై పాము కాటు వేసింది. చుట్టుపక్కల ఉన్నవారు స్పందించి 108 అంబులెన్స్‌లో పొదిలి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉద్యోగ ప్రకటన

ఉత్తర్వు జిల్లా కలెక్టరు, ప్రకాశం జిల్లా, తేది: 26-08-2023

జిల్లాలో ఎన్.టి.ఈ.పి.(జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమము) బాపట్ల జిల్లా కేంద్రము నందు కాంట్రాక్టు పద్ధతిన పనిచేయుటకు దిగువ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరడమైనది.

క్రమ సంఖ్య	ఉద్యోగము పేరు	ఖాళీల సంఖ్య	రోస్టర్
1	మెడికల్ ఆఫీసర్ (M.O)	01	OC
2	డిస్ట్రిక్ట్ ప్రోగ్రాము కో ఆర్డినేటర్ (DPC)	01	SC
3	డిస్ట్రిక్ట్ పి. యం.డి.టి. మరియు టి.బి.హెచ్.ఐ.వి. కో-ఆర్డినేటర్ (సీనియర్ డాట్స్ ప్లస్ మరియు టి.బి. హెచ్.ఐ.వి. సూపర్వైజర్) (DPS)	01	SC
4	పి.పి.ఎం కో-ఆర్డినేటర్ (PPM Co&ordinator)	01	SC
5	అకౌంటెంట్ (Accountant)	01	OC
	పూర్తి ఖాళీలు	05	

ఇందుకు సంబంధించిన వివరాలకు https://prakasam.ap.gov.in/notice_category/recruitment/ వెబ్సైట్ నందు తేది: 27-08-2023 నుండి సందర్శించగలరు.

సం/- డిస్ట్రిక్ట్ లెప్రసీ, ఎయిడ్స్ & క్షయ అధికారి, ప్రకాశం జిల్లా | సం/- డిస్ట్రిక్ట్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్, ప్రకాశం జిల్లా | సం/- కలెక్టర్ మరియు అధికారి, మెజిస్ట్రేట్, ప్రకాశం జిల్లా

మరణ మృదంగం

- ఎదురెదురుగా ఢీకొన్న ఆర్టీసీ బస్సు, బొలెరో ట్రక్
- ఇద్దరు వ్యక్తులు మృతి, ఓ మహిళకు గాయాలు
- భజన కార్యక్రమం ముగించుకుని వస్తుండగా విషాదం
- త్రిపురాంతకం మండలం ముడివేముల వద్ద ఘటన



సుందరయ్య మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు



మృతి చెందిన శ్రీనివాసరావు



ప్రమాదానికి గురైన బొలెరో వాహనం

త్రిపురాంతకం: భక్తి గీతాలు ఆలపిస్తూ కుటుంబాలను పోషించుకునే బృందాన్ని మృత్యువు వెంటాడింది. శుక్రవారం రాత్రి భజన కార్యక్రమం ముగించుకుని ఇంటికి బయలుదేరిన ఆ బృందంలోని ఇద్దరు మార్గమధ్యంలో సంభవించిన ప్రమాదంలో మృత్యువాతపడగా మరో మహిళకు గాయాలయ్యాయి. ఈ విషాద ఘటన జాతీయ రహదారిపై త్రిపురాంతకం మండలం ముడివేముల మెట్ట సమీపంలో కందుర్లవాగు వద్ద శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు వివరాలు.. పల్నాడు జిల్లా శిరిగిరిపాడు గ్రామానికి చెందిన పోకలగంగ శ్రీనివాసరావు(50) శ్రీవీరాంజనేయస్వామి భజన బృందాన్ని నిర్వహిస్తున్నారు. ఆలయాల్లో ఉత్సవాల సందర్భంగా కచేరీలు ఇస్తుంటారు. శ్రావణ శుక్రవారం సందర్భంగా నూజెండ్ల మండలం భూమాయిపాలెం గ్రామంలో భజన కార్యక్రమం ముగించుకుని తమ బొలెరో వాహనంలో శిరిగిరిపాడు గ్రామానికి బయలుదేరారు. ఈ క్రమంలో శనివారం వేకువజామున అనంతపురం నుంచి విజయవాడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు, బొలెరో వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో భజన బృందంలోని సభ్యుడు సుందరయ్య(30) అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడిన పోకల గంగ శ్రీనివాసరావును(50) వైద్యశాలకు తరలించగా అక్కడ మరణించారు. మరో సభ్యురాలు పల్నాడు జిల్లా కొత్తపాలెం సమీపంలోని నాగిరెడ్డిపల్లికి చెందిన రమాదేవి గాయపడ్డారు. మృతుడు సుందరయ్య స్వగ్రామం పెద్దారవీడు మండలం కర్రోల కాగా భార్య, నలుగురు కుమార్తెలతో కలిసి యర్రగొండపాలెంలో నివాసం ఉంటున్నట్లు తెలిసింది. తండ్రి మృతదేహం నలుగురు చిన్నారులు బిక్కుబిక్కుమంటూ రోదిస్తున్న తీరు అందరినీ కంటతడి పెట్టించింది. సంఘటనా స్థలాన్ని సీఐ పాపారావు పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సుమన్ తెలిపారు.



బంగారు, వజ్రాభరణాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న వేగ ప్రతినిధులు

ఆకట్టుకున్న 'వేగ' బంగారు, వజ్రాభరణాల ప్రదర్శన

ఒంగోలు: స్థానిక హోటల్ సరోవర్‌లో వేగ జ్యూయలర్స్ బంగారు, వజ్రాభరణాల ప్రదర్శన వినియోగదారులను విశేషంగా ఆకట్టుకుంది. విజయవాడ, హైదరాబాద్ లాంటి నగరాలల్లో బంగారు, వజ్రాభరణాల షోరూంలు నిర్వహిస్తున్న వేగ జ్యూయలర్స్ ఒంగోలులో ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేసింది. శనివారం ప్రారంభ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు వనమా నవీన్, వనమా సుధాకర్ మాట్లాడుతూ.. మంగళప్రదమైన వేడుకలకు, వివాహాది శుభకార్యాలకు కావాల్సిన విశిష్ట ఆభరణాలను ప్రదర్శనలో ఉంచామన్నారు. బంగారు ఆభరణాల మేకింగ్ చార్జీలపై 50 శాతం తగ్గింపు, పోల్కీ జ్యూయలరీపై ఎటువంటి మేకింగ్, వేస్టేజీ చార్జీలు లేవని చెప్పారు. డైమండ్ జ్యూయలరీ క్యారట్ రూ.56వేలు మాత్రమేనన్నారు. ఆదివారంతో ప్రదర్శన ముగుస్తుందని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేగ జ్యూయలర్స్ బ్రాండ్ షోరూంలను తెలుగు రాష్ట్రాల్లోని మరికొన్ని నగరాలకు విస్తరించే ప్రతిపాదన ఉందని చెప్పారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం



అగ్నిప్రమాదం జరిగిన అపార్టుమెంట్

ఒంగోలు సిటీ: టీవీ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నిప్రమాదం సంభవించిన సంఘటన ఒంగోలు నగరంలోని నిర్మలనగర్‌లో శ్రీదేవి అపార్టుమెంట్‌లో శనివారం ఉదయం చోటుచేసుకుంది. అగ్నిమాపక శాఖాధికారుల కథనం ప్రకారం.. అపార్టుమెంట్‌లోని ఫస్ట్ ఫ్లోర్‌లో ఉంటున్న ఓ కుటుంబం మూడు రోజుల క్రితం చెన్నైకి వెళ్లినట్లు సమాచారం. తాళం వేసి ఉన్న ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు ఫైర్ సిబ్బందికి సమాచారం తెలియజేశారు. వారు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని కిటికీల అద్దాలు పగలగొట్టి మంటలు అదుపు చేశారు. టీవీ షార్ట్ సర్క్యూట్ వల్లే ప్రమాదం సంభవించిందని ఫైర్ సిబ్బంది తెలిపారు. రూ.50 వేలు నష్టం వాటిల్లిందని చెప్పారు. అసిస్టెంట్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులరెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జెడ్పీ చైర్‌పర్సన్ జన్మదిన వేడుకలు



జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే టీజేఆర్



చీమకుర్తి జెడ్పీ బాలికల హైస్కూల్లో కేక్ కట్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్, పక్కన శివప్రసాదరెడ్డి

చీమకుర్తి: జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ పుట్టినరోజు వేడుకలను శనివారం చీమకుర్తిలోని వారి నివాసంలో ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో అభిమానులు, పార్టీ నేతల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జెడ్పీ చైర్‌పర్సన్‌కు సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు స్థానిక బూచేపల్లి పార్కు వద్ద పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్లో విద్యార్థినులు, కుమారుడు, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాదరెడ్డితో కలిసి బూచేపల్లి వెంకాయమ్మ కేక్ కట్ చేశారు. జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో బాలికలకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా బాలికలు, టీచర్‌లు, స్థానిక నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. తొలుత బూచేపల్లి నివాసంలో కుటుంబ సభ్యులతో కలిసి కేక్ కట్ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గజమాలలతో ఘనంగా సత్కరించారు. బూచేపల్లి పార్కులో మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి సుబ్బారెడ్డి, బూచేపల్లి కమలాకర్‌రెడ్డి స్మారకాల వద్ద జెడ్పీ చైర్‌పర్సన్ నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ చల్లా అంకులు, వై.జనార్దన్‌రెడ్డి, పులి వెంకటరెడ్డి, కౌన్సిలర్లు కంజుల ప్రతాప్‌రెడ్డి, తప్పెట బాబూరావు, గోపురపు చంద్ర, పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేత కృష్ణారెడ్డికి ఘన నివాళి





కృష్ణారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, ఎమ్మెల్యే కరణం బలరాం

- కుటుంబ సభ్యులను ఓదార్చిన ఎమ్మెల్యేలు కేపీ, కరణం

పొదిలి రూరల్/కొనకనమిట్ల: మండలంలోని వెలిగండ్ల గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నేత, ఏఎంసీ మాజీ చైర్మన్ చైర్మన్, మాజీ సర్పంచ్ పాతకోట వెంకటకృష్ణారెడ్డి గుండెపోటుతో శుక్రవారం హైదరాబాద్‌లో మృతి చెందారు. శనివారం ఆయన భౌతికకాయాన్ని అభిమానుల సందర్శనార్థం పొదిలిలోని ఆయన స్వగృహంలో ఉంచారు. కృష్ణారెడ్డి భౌతికకాయాన్ని మార్కాపురం, చీరాల ఎమ్మెల్యేలు కేపీ నాగార్జునరెడ్డి, కరణం బలరామకృష్ణమూర్తి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వెన్నా హనుమారెడ్డి సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కృష్ణారెడ్డి కుమార్తె చీరాల ఆర్డీఓ సరోజిని, ఆయన కుమారుడు వెలిగండ్ల సర్పంచ్ పాతకోట వెంకటరెడ్డిని పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. పార్టీకి కృష్ణారెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకుని అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. శనివారం సాయంత్రం కృష్ణారెడ్డి స్వగ్రామమైన కొనకనమిట్ల మండలంలోని వెలిగండ్లలో అంత్యక్రియలు నిర్వహించారు. నివాళులర్పించిన వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శులు సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, కేవీ రమణారెడ్డి, కొనకనమిట్ల ఎంపీపీ మోరబోయిన మురళీకృష్ణ యాదవ్, జెడ్పీటీసీ అక్కిదాసరి ఏడుకొండలు, వైస్ ఎంపీపీ మెట్టు వెంకటరెడ్డి, మర్రిపూడి ఎంపీపీ వాకా వెంకటరెడ్డి, పొదిలి, కొనకనమిట్ల మండల పార్టీ కన్వీనర్లు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, మోరా శంకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రపుశాల శ్రీనివాసులు, పొదిలి పట్టణ పార్టీ అధ్యక్షురాలు నూర్జహాన్‌బేగం, జేసీఎస్ కన్వీనర్ గొలమారి చెన్నారెడ్డి, పార్టీ నాయకులు జి.శ్రీనివాసులు, సానికొమ్ము వెంకటేశ్వరరెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, సూరవరపు పెదవెంకటరెడ్డి, పులిగొర్ల శ్రీనివాసులు, సీసీకేఆర్ శ్రీను, గర్రె శ్రీనివాసులు, పలు గ్రామల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

లోకేష్‌పై చర్యలు తీసుకోవాలి

- పోలీసులకు వైఎస్సార్ సీపీ శ్రేణుల ఫిర్యాదు



సింగరాయకొండలో ఎస్సై శ్రీరామ్‌కు ఫిర్యాదు చేస్తున్న సోషల్ మీడియా ప్రతినిధులు

పామూరు/వెలిగండ్ల/సింగరాయకొండ/టంగుటూరు: రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్న టీడీపీ నాయకుడు నారా లోకేష్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం వైఎస్సార్ సీపీ శ్రేణులు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. కనిగిరి నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ మర్రి రాజు, పామూరు మండల సోషల్ మీడియా కన్వీనర్ షేక్ కరిముల్లా, కోకన్వీనర్లు షేక్.సుబాని, ఓ.వెంకటేష్ తదితరులు పామూరులో ఎస్సై కె.సురేష్‌యాదవ్‌కు ఫిర్యాదు చేసి, కేసు నమోదు చేయాలని కోరారు.

వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కనిగిరి నియోజకవర్గ కోకన్వీనర్ కుప్పనబోయిన రమణయ్య, బాబు, మురళి, అభిషేక్ తదితరులు శనివారం వెలిగండ్ల పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్ శ్రీనుకు ఫిర్యాదు చేశారు.

టీడీపీ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు అచ్చంనాయుడు తమ ప్రసంగాల ద్వారా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని, వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా జిల్లా కోకన్వీనర్ భరత్‌రెడ్డి, మండల కన్వీనర్ జెస్సీపాల్, నాయకులు రియాజ్ పఠాన్, అశోక్, చుక్కా అశోక్, రమేష్, చొప్పర కిరణ్‌కుమార్, విజయ్, నరసింహ తదితరులు కలిసి సింగరాయకొండ ఎస్సై టి.శ్రీరామ్‌కు ఫిర్యాదు చేశారు.

రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్న టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు అన్నారు. టంగుటూరు పోలీసుస్టేషన్లో ఎస్సై ఖాదర్‌కు ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియా మండల కన్వీనర్ కొమ్ము అనీల్, కో కన్వీనర్ పటాపంజుల సాయి, కొండపి ఏఎంసీ డైరెక్టర్ కొమ్ము సురేంద్ర, నాయకులు కొమ్ము బుజ్జి, దుగ్గిరాల పేర్రాజు, రావినూతల మనోహర్, దొనంపూడి కిరణ్, శిఖ జాయ్ పాల్గొన్నారు.

పేదల కోసమే 'ఆహా' క్యాంటీన్

- కనిగిరి ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్



ఆహా క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్

కనిగిరి రూరల్: పేదలు, కార్మికులు, కూలీలకు ఆహా క్యాంటిన్ ఎంతో ఉపయోకరమని ఎమ్మెల్యే, ఎస్జీ రంగా వర్శిటీ బోర్డ్ మెంబర్ బుర్రా మధుసూదన్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో శనివారం ఆహా క్యాంటీన్‌ను ఎమ్మెల్యే బుర్రా చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మెప్మా మహిళలు తక్కువ ధరకు ఆహార పదార్థాలు అందించడం అభినందనీయమన్నారు. పులిహోర, పెరుగన్నం, వెజిటబుల్ పులావ్, సాంబారు అన్నంను రూ.30కే అందిస్తున్నట్లు ఎమ్మెల్యేకు మెప్మా అధికారులు వివరించారు. ఆహా క్యాంటీన్‌లో ఆహార పదార్థాలను ఎమ్మెల్యే రుచి చూశారు. మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్, కమిషనర్ డీవీఎస్ నారాయణరావు, వైస్ చైర్మన్లు పులి శాంతి గోవర్ధన్, ఆర్.మాణిక్యరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు రంగనాయకులరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ వేల్పుల వెంకటేశ్వర్లు, అబ్రహం లింకన్, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, వైస్ ఎంపీపీ తిరుపతిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, మెప్మా టీఎంసీ రఘు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకే ఇగ్నైట్ యంగ్ మైండ్స్

- ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి
- నియోజకవర్గ స్థాయి పోటీల్లో విజేతలకు బహుమతులు



విజేతలతో ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి

మార్కాపురంటౌన్: విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికితీసేందుకు ప్రతి నెలా ఇగ్నైట్ యంగ్ మైండ్స్ చేపడుతున్నట్లు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం మార్కాపురం బాలుర ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి ఇగ్నైట్ యంగ్ మైండ్స్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సైన్స్‌పై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కష్టపడి చదవాలని చెప్పారు. జెడ్పీ బాయ్స్ హెచ్‌ఎం ఎం.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్విజ్ పోటీల్లో జూనియర్ విభాగంలో మిట్టమీదిపల్లి ఏపీ మోడల్ స్కూల్, జెడ్పీహెచ్‌ఎస్-చెన్నారెడ్డిపల్లి, జెడ్పీ హెచ్‌ఎస్-కలుజువ్వలపాడు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచాయి. సీనియర్ విభాగంలో జెడ్పీహెచ్‌ఎస్-గొట్లగట్టు, జెడ్పీహెచ్‌ఎస్ గరల్స్-మార్కాపురం, జెడ్పీహెచ్‌ఎస్ బాయ్స్-మార్కాపురం వరుసగా మూడు బహుమతులు గెలుపొందాయి. వ్యాసరచన, జూనియర్, సీనియర్, ఫోక్ డ్యాన్స్ పోటీల్లో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి చేతులమీదుగా సర్టిఫికెట్స్, మెమెంటోలు అందజేశారు. క్విజ్, వ్యాసరచన, ఫోక్ డ్యాన్స్ న్యాయనిర్ణేతలుగా శ్రీనివాసరావు, పిన్నిక నాగేశ్వరరావు, ప్రతిమ వ్యవహరించారు.

కార్యక్రమంలో మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పెద్దారవీడు మండలాల ఎంఈఓలు బి.రాందాస్‌నాయక్, టి.శ్రీనివాసులు, అచ్యుత సుబ్బారావు, బి.నరసింహారావు, ఎస్‌వీసీహెచ్ సుబ్రహ్మణ్యం, హెచ్‌ఎంలె సీహెచ్ శ్రీనివాస మల్లికార్జున్, కొండెపోగు ప్రవీణ్‌కుమార్, సీహెచ్ సత్యనారాయణ, కుమార్‌రెడ్డి, ఇగ్నైట్ యంగ్ మైండ్స్ సభ్యులు మండ్ల రామాంజనేయులు, ప్రభాకర్‌రెడ్డి, రత్నరాజు, భాస్కర్‌రెడ్డి, రమేష్‌బాబు, వివిధ మండలాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.